సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
గురువారం । 22 । సెప్టెంబర్ । 2022

సింహాచలం దేవస్థానం ఈవోగా త్రినాథరావు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవోగా రాష్ట్ర దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ వి.త్రినాథరావు నియమితులయ్యారు. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానానికి ఈవోగా ఉన్న ఆయనకు సింహాచలం దేవస్థానం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో త్రినాథరావు దేవదాయశాఖ విశాఖ అసిస్టెంట్ కమిషనర్‌గాను, డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. అలాగే 2020 సెప్టెంబరు 2వ తేదీ నుంచి 2021 జనవరి 21వ తేదీ వరకు సింహాచలం దేవస్థానం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వర్తించారు.

త్వరితగతిన కేసుల దర్యాప్తు



పోక్సో, మహిళలపై జరిగే నేరాలు, ఎస్సీ, ఎస్టీ కేసులలో త్వరితగతిన దర్యాప్తు చేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ గౌతమిసాలి అన్నారు.

8లో

న్యూస్‌రీల్

నేడు గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

రంపచోడవరం: డివిజన్ పరిధిలో కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల అర్హత జాబితాను కేజీబీవీ కార్యాలయంలోఉంచినట్టు పేర్కొన్నారు. జాబితాలోని అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ ఉదయం 9.30 గంటలకు రంపచోడవరం డైట్ కార్యాలయంలో డెమో టీచింగ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని తెలిపారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి



రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రంలో ఈకేవైసీ చేయిస్తున్న ఏడీఏ సావిత్రి

రాజవొమ్మంగి : ఖరీఫ్ సీజన్‌లో ప్రతీ రైతు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని అడ్డతీగల ఏడీఏ కంకిపాటి సావిత్రి తెలిపారు. రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆమె ఈకేవైసీ ప్రక్రియను ప్రారంభించారు. కొంత మంది రైతులకు ఆమె స్వయంగా ఈకేవైసీ నమోదు చేసి, స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ క్రాపు నమోదు చురుకుగా సాగుతోందన్నారు. అడ్డతీగల డివిజన్‌లోని వై.రామవరం, అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి మండలాల్లో ఇప్పటి వరకు 34,386 ఎకరాలకు సంబంధించి 14,134 మంది రైతులకు ఈ క్రాపు నమోదు పూర్తయ్యిందని చెప్పారు. మరో 15శాతం పూర్తి కావాల్సి ఉందని తెలిపారు.ఈ క్రాపు నమోదుకు ఈనెల 27వ తేదీ ఆఖరి గడువు అని చెప్పారు. నూతనంగా ప్రారంభించిన ఈకేవైసీ నమోదు కూడా అతి ముఖ్యమైందన్నారు. ఈకేవైసీ పూర్తయితే రైతుకు సున్నా వడ్డీ రాయితీ, ధాన్యం విక్రయం, క్రాపు ఇన్సూరెన్స్ తదితర వాటిని అమలు చేయడం సులభతరం అవుతుందన్నారు. అక్టోబర్ 5వ తేదీనాటికల్లా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు రాము, రామరాజు, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

అగ్రిటూరిజంపై చింతపల్లిలో సదస్సు రేపు

చింతపల్లి: అగ్రిటూరిజంపై ఈనెల 23న చింతపల్లిలో సదస్సు నిర్వహించనున్నట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు. పరిశోధన కేంద్రంలో వివిధ రకాల పూల మొక్కలను పెంచడంతో పాటు, ఓపెన్ రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. లంబసింగి, తాజంగి ప్రాంతాల్లో కూడా పూల సాగును అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో అవగాహన కల్పించేందుకు సదస్సు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): ఆధునికీకరణ, భద్రతా పనుల నేపథ్యంలో హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. ఈనెల 23, 24, 27 తేదీల్లో బయల్దేరాల్సిన విశాఖపట్నం–అమృతసర్(20807) ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో ఈనెల 24, 25, 28 తేదీల్లో బయల్దేరాల్సిన అమృతసర్– విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

కష్టాలకు సెల్‌విక

- మెరుగుపడనున్న సమాచార వ్యవస్థ
- పాడేరు డివిజన్‌లో 2,129 సెల్ టవర్ల ఏర్పాటుకు చర్యలు
- పలు చోట్ల స్థల సేకరణ పూర్తి... పనులు ప్రారంభం
- జనవరి నాటికి మారుమూల గ్రామాల్లో మోగనున్న సెల్‌ఫోన్లు

జిల్లాలో చాలా గ్రామాల్లో చెట్లు,గుట్టలు ఎక్కితే గాని సెల్ సిగ్నల్స్ అందని పరిస్థితి. ఫోన్ చేయాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన దుస్థితి. దీంతో అత్యవసర సమయాల్లో సమాచారం అందక, వైద్య, ఇతర సేవలు పొందలేక, ఆన్‌లైన్ కారణంగా పథకాలు మంజూరు కాక ఏజెన్సీ వాసులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇక ఈ కష్టాలకు చెక్ పడనుంది. పాడేరు డివిజన్‌కు వివిధ నెట్‌వర్క్ సంస్థలకు చెందిన 2,129 సెల్ టవర్లు మంజూరయ్యాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో స్థల సేకరణ, నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జనవరి నెలాఖరులో వీటి నిర్మాణం పూర్తి కానుంది.



హుకుంపేట మండలం గరుడపల్లిలో నిర్మాణంలో ఉన్న జియో సెల్ టవర్



సొలభం ఘాట్‌రోడ్డులో సెల్ సంకేతాలకు ఇబ్బందులు పడుతున్న యువకులు



పాడేరు మండలం గబ్బంగి పంచాయతీ పనసపల్లి గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ కోసం స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం

పాడేరు : జిల్లాలోని పాడేరు, అరకు నియోజకవర్గాల్లో సమాచార వ్యవస్థను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయి. కమ్యూనికేషన్ వ్యవస్థ లేకపోవడంతో మారుమూల గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వారు ఫోన్ సమాచారానికి కూడా నోచుకోవడం లేదు. ఈ సమస్యను గుర్తించిన పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణంతో పాటు సెల్ టవర్ల నిర్మాణాల ద్వారా కమ్యూనికేషన్ వ్యవస్థను కూడా మెరుగుపర్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు నివేదికలు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పలు నెట్‌వర్క్ సంస్థలతో సమావేశాలు నిర్వహించింది. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణలు సైతం సెల్ టవర్ల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా టవర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే పొరుగున ఉన్న ఒడిశా రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ బలంగా ఉంది. జియో, బీఎస్ఎన్ఎల్, ఇతర నెట్‌వర్క్ సంస్థలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూడా టవర్లు నిర్మించాయి. పాడేరు డివిజన్‌లోని అన్ని మారుమూల ప్రాంతాలకు సెల్‌టవర్లు మంజూరవడంతో ఇటీవల స్థల పరిశీలనను అధికారులు పూర్తి చేశారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి.

నూరుశాతం కమ్యూనికేషన్ లక్ష్యం

పాడేరు, అరకులోయ నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాల్లో కేవలం 18శాతం గ్రామాలకు మాత్రమే మొబైల్ సిగ్నల్స్ అందుబాటులో ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థ లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 11 మండలాల్లోని 244 పంచాయతీల్లోనూ సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆన్‌లైన్ చేసేందుకు, ఇతర అవసరాలకు కమ్యూనికేషన్ వ్యవస్థ లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం, పాడేరు ఐటీడీఏలు కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపర్చేందుకు చర్యలు చేపట్టాయి. ఏజెన్సీ 11 మండలాల్లో 1379 బీఎస్ఎన్ఎల్ టవర్లు, సబ్‌ప్లాన్ మండలం దేవరాపల్లిలో రెండు టవర్లతో కలిపి మొత్తం 653 జియో నెట్‌వర్క్ టవర్లు, 99 ఎయిర్‌టెల్ టవర్లు మంజూరయ్యాయి.



అందుబాటులోకి రానున్న జియో టవర్

ఏజెన్సీలో టవర్ల వివరాలు

మండలం	జియో	బీఎస్ఎన్ఎల్	ఎయిర్‌టెల్
అనంతగిరి	78	165	10
అరకులోయ	35	80	02
డుంబ్రిగుడ	18	162	05
హుకుంపేట	38	122	01
ముంచంగిపుట్టు	129	87	14
పెదబయలు	82	139	15
చింతపల్లి	63	80	11
జి.మాడుగుల	94	173	03
జి.కె.వీధి	67	173	17
కొయ్యూరు	27	132	15
పాడేరు	20	66	06
దేవరాపల్లి	02	-	-

గిరిజనులకు మేలు



ఏజెన్సీలోని సెల్ టవర్లు ఏర్పాటై, కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగు పడితే గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుంది. రోడ్లు, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు లక్ష్యంగా పనిచేస్తున్నాం. మారుమూల గ్రామాలకు సెల్ టవర్లు ఏర్పాటు చేయడం ద్వారా అన్ని ప్రభుత్వ పథకాల అమలుతో పాటు గిరిజనులకు సత్వర సేవలు అందుతాయి. విద్య, వైద్య రంగాల బలోపేతానికి కూడా కమ్యూనికేషన్ వ్యవస్థ దోహదం చేస్తుంది. జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు జరపడం ద్వారా సెల్ టవర్ల ఏర్పాటు ప్రక్రియ వేగవంతమవుతోంది. అన్ని గ్రామాల్లో సెల్‌ఫోన్లు వినియోగంలోకి వస్తే ప్రజల కష్టాలు తీరుతాయి.

– ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు.

అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

కలెక్టర్ సుమిత్ కుమార్



తాళ్లూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

దేవీపట్నం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులైన అర్హులందరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రయోజనాలు అందిస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గోదావరి నదీ పరీవాహక ప్రాంతమైన కొండమొదలు పంచాయతీలోని తాళ్లూరు గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పోశమ్మగండి నుంచి టూరిజం బోటుపై తాళ్లూరు వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలెక్టర్ సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను అనుసరించి అర్హులైన ప్రతిఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తామన్నారు. నిర్వాసితుల పునరావాసం కోసం ఇళ్లు నిర్మించినట్టు చెప్పారు. ఆ కాలనీలకు తరలి వెళ్లాలని కోరారు. భూమికి భూమి పరిహారం కోసం సాగుయోగ్యమైన స్థలాలను ఇప్పటికే సేకరించినట్టు చెప్పారు. సమస్యలుంటే ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య, సబ్ కలెక్టర్ కట్టా సింహాచలం, తహసీల్దార్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏవోబీలో విస్తృతంగా తనిఖీలు



అరకులోయలో బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ జి.డి.బాబు

- మావోయిస్టు పార్టీ వార్షికోత్సవం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం

సాక్షి, పాడేరు: మావోయిస్టు పార్టీ 18వ వార్షికోత్సవం నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ఏవోబీతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం నుంచి వార్షికోత్సవాలు నిర్వహించి, విజయవంతం చేయాలని ఆ పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పిలుపునివ్వడంతో జిల్లా సరిహద్దులో ఉన్న ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్, ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా చర్యలను విస్తృతం చేశారు. మారుమూల ప్రాంతాలను కూంబింగ్ పార్టీలు జల్లెడ పడుతున్నాయి. వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. బాంబ్ స్క్వాడ్‌లతో ప్రధాన జంక్షన్లు, మారుమూల రోడ్ల వద్ద తనిఖీలు చేపడుతున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి మండల కేంద్రాలకు వచ్చే ప్రయాణికుల లగేజీ బ్యాగులను కూడా క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. పర్యాటక ప్రాంతం అరకులోయలో సీఐ జి.డి.బాబు, పాడేరు ప్రాంతంలో సీఐ సుధాకర్ వాహనాలను తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని సేకరించిన తర్వాతే వదిలిపెట్టారు. ఆర్టీసీ బస్సుల్లో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాత్రిపూట పోలీసుల గస్తీ ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం వరకు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకపోవడంతో మారుమూల ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



పాడేరులో తనిఖీ నిర్వహిస్తున్న సీఐ సుధాకర్

పక్కాగా నిత్యావసర సరకుల పంపిణీ



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ శివ శ్రీనివాస్

జేసీ శివ శ్రీనివాస్

సాక్షి,పాడేరు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పక్కాగా నిత్యావసర సరకులను సకాలంలో పంపిణీ చేయాలని జేసీ జె.శివ శ్రీనివాస్ ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాలు, గిరిజన సహకార సంస్థ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిత్యావసర సరుకుల పంపిణీపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన షెడ్యూలు ప్రకారం లబ్ధిదారులకు సరకులు పంపిణీ జరిగేలా తహసీల్దారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఐసీడీఎస్, మధ్యాహ్న భోజన పథకం, వసతిగృహాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని, సంబంధిత బియ్యం సంచులపై ఫుడ్ గ్రేడ్ రెడ్‌కలర్‌లో మార్క్ చేసి సరఫరా చేయాలని తెలిపారు. నిత్యావసర సరకులను పంపిణీ చేయకుండా గిడ్డంగుల్లో నిల్వ ఉంచడం వల్ల నాణ్యత తగ్గిపోతుందన్నారు. డీలర్లు సకాలంలో డీడీలు తీసి అందజేయాలని సూచించారు. ప్రైవేటు వాహనాల్లో సరకులు రవాణా చేస్తే ప్రజా పంపిణీ సరుకుల రవాణా చేస్తున్నట్టు బ్యానరు ఏర్పాటు చేయాలన్నారు. కొయ్యూరు మండలం పలకజీడి, యు.చీడిపాలెం, మఠం భీమవరం, పోతవరం ఎంఎల్ఎస్ పాయింట్లను మారేడుమిల్లి జీసీసీ పరిధిలోకి మారిస్తే లబ్ధిదారులకు సౌకర్యంగా ఉంటుందని జీసీసీ అధికారులు సూచించగా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీహరి, డీఎం బి.గణేష్‌కుమార్, జీసీసీ జనరల్ మేనేజర్ యుస్టస్, డీఎం కె.పార్వతమ్మ, సివిల్ సప్లై డీటీ ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పీజీ పరీక్షల దరఖాస్తు గడువు అక్టోబర్ 18

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్ష ఫీజును అక్టోబర్ 18వ తేదీ లోగా చెల్లించాలని సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో అక్టోబర్ 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థులు తమ అసైన్‌మెంట్, ప్రాజెక్ట్ రిపోర్టులను అక్టోబర్ 18వ తేదీలోగా చెల్లించాలని, రూ.500 అపరాధ రుసుంతో నవంబర్ 1వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు. హాల్‌టికెట్లను అక్టోబర్ 29వ తేదీ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. నవంబర్ 2వ తేదీ నుంచి పరీక్షలు ఉంటాయన్నారు. పూర్తి సమాచారం కోసం ఏయూ వెబ్‌సైట్‌ను, 0891 2844164, 2754966 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

- ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలపై ప్రత్యేక శ్రద్ధ
- పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాలు



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

సాక్షి,పాడేరు : ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, నాణ్యతలో రాజీ పడకుండా నిర్మాణాలు పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయం నుంచి 11 మండలాల ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఏటీడబ్ల్యూవోలు, సీడీపీవోలు, ఎంఈవోలు, ఉపాధి హామీ అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మనబడి నాడు–నేడు పనులను ఏటీడబ్ల్యూవోలు,ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పర్యవేక్షించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో కూలి పనులు కల్పించి, లక్ష్యాలను సాధించాలన్నారు. మిషన్ అమృత్ సరోవర్, ఆస్పత్రుల్లో నాడు–నేడు, జగనన్న స్వచ్ఛ సంకల్పం, సీసీడీపీ, ఎస్ఈఏ, టీఎల్‌డబ్ల్యూ పనులు, తాజంగిలోని స్వాతంత్ర్య సమర యోధుల మ్యూజియం, జామిగుడ రోడ్డు నిర్మాణ పనులపై అధికారులతో పీవో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఈఈ డి.వి.ఆర్.ఎం. రాజు, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్, పీఐయూ ఈఈ కె.లావణ్యకుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందరబాబు, ఉపాధిహామీ ఏపీడీ జె.గిరిబాబు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని, ఎంఈవో సరస్వతిదేవి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం







విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్, పాడేరు, చింతూరు ఐటీడీఏ పీవోలు గోపాలకృష్ణ, రామశేషు

సాక్షి,పాడేరు/చింతూరు : నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పాడేరు, చింతూరు ఐటీడీఏ పీవోలు ఆర్.గోపాలకృష్ణ, రామశేషు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్‌లు తెలిపారు. నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం వారు వేర్వేరుగా ప్రారంభించారు. పాడేరు మండల పరిధిలోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుడివాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులతో ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్‌లు నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 3,07,839 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. తొలిరోజు 2,84,259 మందికి పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ నెల 24వ తేదీ వరకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ మాత్రలను పంపిణీ చేస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డీడీ ఐ.కొండలరావు, డీఎంహెచ్‌వో బి.సుజాత, ఏడీఎంహెచ్‌వో కె.లీలాప్రసాద్, జిల్లా డీటీసీవో డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు, స్థానిక సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, మినుములూరు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

వీఆర్‌పురం మండలం రేఖపల్లి కేజీబీవీలో చింతూరు ఐటీడీఏ పీవో రామశేషు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణతో విద్యార్థుల్లో ఎదుగుదలతో పాటు వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. చింతూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, కేజీబీవీలో ఎంపీపీ సవలం అమల, గురుకుల పాఠశాలలో సర్పంచ్ కారం కన్నారావు విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. డివిజన్ వ్యాప్తంగా బుధవారం 624 కేంద్రాల్లో 27,598 మందికి ఈ మాత్రలను పంపిణీచేసినట్టు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు.

ఈ వ్యక్తి ఆచూకీ తెలపరూ..


మోహన్‌రావు (ఫైల్)

ముంచంగిపుట్టు : మండలంలో గల కర్రిముఖీపుట్టు పంచాయితీ తాంగుల గ్రామానికి చెందిన గల్లేల మోహన్‌రావు (51) నాలుగు రోజులుగా కనిపించడం లేదని, అతని ఆచూకీ తెలిస్తే తెలపగలరని కుటుంబ సభ్యుడు గల్లేల అర్జున్ కోరారు. ఈ నెల 17వ తేదీ ఊరు నుంచి పనుల నిమిత్తం బయటకు వచ్చి తర్వాత నుంచి అతని జాడ లేదని, సమీప గ్రామాలు, బంధువుల వద్దకు వెళ్లి ఆరా తీసినా ఆచూకీ లభించలేదని తెలిపారు. దీంతో బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశామన్నారు. మోహన్‌రావు ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9392869690, 9346142033 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


ముంచంగిపుట్టులో తనిఖీలకు వెళ్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు


పెదబయలులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు


చింతపల్లిలో తనిఖీలు చేస్తున్న పోలీసులు


జడ్డంగి శివార్లలో వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ షరీఫ్

కొయ్యూరు/పెదబయలు/ముంచంగిపుట్టు/చింతపల్లి: మావోయిస్టుల విలీన వార్షికోత్సవం సందర్భంగా పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొయ్యూరు మండలంలోని నడింపాలెంలో బుధవారం కొయ్యూరు సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మావోయిస్టుల విలీన వారోత్సవాల నేపథ్యంలో నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తనిఖీల్లో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ పాల్గొన్నారు. పెదబయలు మండల కేంద్రంలో స్థానిక ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలు సేకరించి విడిచిపెట్టారు. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో బుధవారం స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మారుమూల బుంగాపుట్టు,భూసిపుట్టు,రంగబయలు, కుమడ,జోలాపుట్టు పంచాయతీల నుంచి మండల కేంద్రానికి వచ్చే వాహనాలను తనిఖీ చేసి, అనుమానితుల వివరాలు సేకరించారు.

సీఆర్‌పీఎఫ్ బలగాలు మండల కేంద్రం నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో దారిపొడవునా ఉన్న కల్వర్టులు,వంతెనలను బాంబ్ స్క్వాడ్‌తో పరిశీలించాయి. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన మాచ్‌ఖండ్,జోలాపుట్టు గ్రామాల వద్ద బీఎస్‌ఎఫ్ బలగాలు గస్తీ నిర్వహిస్తున్నాయి. ఏవోబీలో వాహనాలు,ప్రయాణికుల రాకపోకలపై నిఘాను ఉంచారు. చింతపల్లిలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. వారోత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని చింతపల్లి ఎస్‌ఐ మహ్మద్ షరీఫ్ ఆలీ తెలిపారు.

రాజవొమ్మంగి మండలంలోని జడ్డంగి-చెరకుంపాలెం గ్రామాల మధ్య బుధవారం జడ్డంగి ఎస్‌ఐ షరీఫ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. కొత్తవారిని ప్రశ్నించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనచోదకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

త్వరితగతిన కేసుల దర్యాప్తు


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమిసాలి


పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌ను తిలకిస్తున్న జిల్లా పోలీసు అధికారులు

- ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లిటౌన్ : పోక్సో, మహిళలపై జరిగే నేరాలు, ఎస్సీ, ఎస్టీ కేసులలో త్వరితగతిన దర్యాప్తును ముమ్మరం చేయాలని ఎస్పీ గౌతమిసాలి అన్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం సమీక్షలో ఆమె మాట్లాడారు. రౌడీషీటర్లు, కిరాయి హత్యలు, కొట్లాట్లకు పాల్పడే వారిపై నిఘా పెంచాలన్నారు. గంజాయి అక్రమ రవాణా చేసే వారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని చెప్పారు. నేషనల్‌హైవే, రాష్ట్ర అంతర్గత రహదారుల్లో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను విస్తృతం చేయాలన్నారు. ప్రభుత్వ అనుమతి పొందిన బాణసంచా కేంద్రాలు, మ్యాగజైన్‌లను తనిఖీలు నిర్వహించి భద్రతా చర్యలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ బాణసంచా తయారీ, రవాణాకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. రాత్రి గస్తీని ముమ్మరం చేయాలన్నారు. అంతకుముందు పవర్‌పాయింట్‌ప్రెజెంటేషన్ ద్వారా నేరాల నియంత్రణపై తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైం అదనపు ఎస్పీ బి.లక్ష్మీనారాయణ, డీఎస్పీ బి.సునీల్, నర్సీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు నరసింహారావు, చంద్రశేఖర్, లక్ష్మణమూర్తి, అప్పలనాయుడు, రఘువర్మ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బైకుల్లో పెట్రోల్ చోరీ

- అడ్డతీగలలో విచ్చలవిడిగా చోరీ ముఠాలు

అడ్డతీగల: ఇళ్ల బయట ఉన్న బైక్‌లే లక్ష్యంగా పెట్రోల్ చోరీలు ఇటీవల మండల కేంద్రమైన అడ్డతీగలలో విచ్చలవిడిగా జరుగుతున్నాయి.వీటిలో ఎక్కువగా 10 నుంచి 20 ఏళ్ల లోపు యువకులే ప్రధాన పాత్ర వహిస్తున్నట్టు తెలియవచ్చింది.బైక్‌ల ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ల నుంచి అర్ధరాత్రి సమయాల్లో పెట్రోల్ చోరీ చేస్తున్నారని వాహన యజమానులు చెబుతున్నారు. ఈ నెల రోజుల వ్యవధిలో ఎల్‌ఐసి వీధిలో వరుసపెట్టి దాదాపు 20కి పైగా బైక్‌లు నుంచి నాలుగుసార్లు పెట్రోల్ చోరీలు జరిగాయంటున్నారు. రెండు రోజుల క్రితం అదే వీధిలో 10 బైక్‌ల నుంచి పెట్రోల్ చోరీ జరిగిందని చెప్పారు. కార్పెంటర్ కాలనీ, మార్కెట్‌రోడ్‌లోని ప్రధాన రహదారుల్లోనూ పెట్రోల్ చోరీ జరుగుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లారేసరికి బైకుల్లో పెట్రోల్ లేకపోవడం వల్ల హతాశులౌతున్నారు.అసలే పెట్రోల్ ధరలు ఆకాశన్నంటుతున్న నేపథ్యంలో వరుస చోరీలు జేబుని గుల్లచేస్తుందని పలువురు వాపోతున్నారు. గతంలో పోలీసుశాఖ నుంచి ప్రతి రోజు రాత్రి సమయాల్లో ఇద్దరు నుంచి నలుగురు కానిస్టేబుళ్ల ద్వారా గ్రామంలో ప్రధాన కూడళ్లు, వీధుల్లో పెట్రోలింగ్ నిర్వహించేవారని గత కొన్నేళ్లుగా పెట్రోలింగ్ లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి పెట్రోల్ చోరీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

వైద్య శిబిరంలో గర్భిణికి ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం, ఆస్పత్రికి తరలింపు

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ కునుకూరులో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. రాజేంద్రపాలెం వైద్య సిబ్బంది ఆధ్వర్వంలో జరిగిన శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. శిబిరానికి వచ్చిన గర్భిణికి పురిటినొప్పులు ప్రారంభమవడంతో సిబ్బంది ప్రసవ సేవలందించారు. ఆమె ఆడబిడ్డను జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం రాజేంద్రపాలెం ఆస్పత్రికి 108లో తరలించినట్టు సీహెచ్‌వో ప్రశాంత్ చెప్పారు. కునుకూరులో ఏడాదిన్నర పాప మృతిపై విచారణ చేశామని, కొద్ది రోజులుగా పాప అనారోగ్యంతో ఉందని, ఆదివారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందినట్టు ఆయన తెలిపారు.

పశువైద్యశాల నిర్వహణపై విచారణ

ఎటపాక: గొరిదేవిపేట పశువైద్యశాల నిర్వహణపై ఉన్నతాధికారులు బుధవారం విచారణ చేపట్టారు. పశువైద్యశాల వైద్యాధికారిని, సిబ్బంది విధులకు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదుతో శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్, పాడేరు జేడీ వెంకటస్వామి ఆస్పత్రికి వచ్చి విచారణ చేశారు. విధుల పట్ల గైర్హాజరుపై డాక్టర్ మాధవిలతను వివరణ తీసుకున్నారు. రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

డైట్‌లో సినీ యూనిట్ సందడి

అనకాపల్లి టౌన్: స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 'పగ పగ పగ' సినీ యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా నిర్మాత సుంకర సత్యనారాయణ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని 31 రోజులపాటు చిత్రీకరించినట్టు తెలిపారు. కొత్త టాలెంట్‌ను ప్రోత్సహించేలా హీరోహీరోయిన్లుగా నూతన నటులు అభిలాష్, దీపికలను తీసుకున్నట్టు పేర్కొన్నారు. కళాశాల చైర్మన్, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. దర్శకుడు ఉయ్యూరి రవిసాయిదుర్గ, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి సోదరుడు సంపత్, కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం, కల్చరల్ కో ఆర్డినేటర్ డి.ఎల్.మైత్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి

కళాశాల ఆవరణలో గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చల్లా నర్సింహం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల క్రీడాపోటీలు


వాలీబాల్ పోటీలో ఉద్యోగులు

అనకాపల్లి టౌన్: స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో బుధవారం జిల్లాక్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సివిల్‌సర్వీసెస్ ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. జిల్లాస్థాయిలో ఒక్కొక్క క్రీడావిభాగం నుంచి ముగ్గురు చొప్పున ఎంపిక చేసినట్టు చీఫ్‌కోచ్ ఎం.అచ్యుతకుమార్ చెప్పారు. స్విమ్మింగ్, క్రికెట్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, కబ్బడీ, హాకీ క్రీడల్లో ఎంపిక జరిగిందన్నారు. అంతకుముందు క్యారమ్స్, వాలీబాల్, షటిల్, చెస్ పోటీలు జరిగాయి.

ఉత్తమ వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

తుమ్మపాల: ఉత్తమ వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారిణి జీఎస్ఎస్ఎస్ లీలావతి అన్నారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతు శిక్షణా కేంద్రంలో బుధవారం జిల్లా వ్యవసాయాధికారులకు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా వాతావరణ కాలుష్యం తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగేలా అధికారులు కృషిచేయాలన్నారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డా.ఎంబీజీఎస్ కుమారి, డా.విశాలాక్షి మాట్లాడుతూ సమగ్ర పంటల యాజమాన్యం గురించి, సమగ్ర ఎరువుల యాజమాన్యం గురించి వివరించారు. జీవ సంబంధ క్రిమినాశకాలను ఎక్కువగా వాడాలని సూచించారు. శిలీంద్ర సంబంధ క్రిమినాశకాలైన బవేరియా, మెటారైజియంను కూరగాయల పంటలకు వినియోగించాలని సూచించారు. రాష్ట్రస్థాయి శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ సిహెచ్.చిరంజీవి పొలంబడి, జీఏపీ ఆర్గానిక్ ఫార్మింగ్, ఆర్గానిక్ సర్టిఫికేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనకాపల్లి మండల ఏవో రంగాచారి పొలంబడి మార్గదర్శకాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు, డీడీఏలు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో చోడవరం విద్యార్థుల ప్రతిభ

- నాలుగు బంగారు పతకాలు కైవసం


బంగారుపతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యోగా కేంద్రం గురువు, నిర్వాహకులు

చోడవరం: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో చోడవరం పతంజలి యోగా విద్యార్థులు సత్తా చాటారు. కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఈనెల 18న రాష్ట్రస్థాయి యోగాపోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చోడవరం పతంజలి యోగా కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో నలుగురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. గొంతిన లయవర్ధన్ (14 ఏళ్ల విభాగం), పందిరి వెన్నెలశ్రీ (15-20 ఏళ్ల విభాగం), పొట్నూరు పవన్‌కుమార్ (15-20 ఏళ్ల విభాగం), కొక్కిరిమెట్టి కార్తిక (20-30 ఏళ్ల విభాగం)లో బంగారు పతకాలు సాధించారు. వీరితోపాటు కొట్టపు హరికిరణ్ బ్రాంజ్‌మెడల్ పొందారు. పతకాలు సాధించిన విజేతలను యోగా కేంద్రం గురువు పుల్లేటి సతీష్, గౌరవ అధ్యక్షుడు పప్పల రమణమూర్తి, చైర్మన్ పసుమర్తి అశోక్, వాసవీక్లబ్ అధ్యక్షుడు పూసర్ల సతీష్ అభినందించారు.

చోడవరం డిగ్రీ కళాశాలతో ఇంటర్న్‌షిప్‌కు ఒప్పందం



సంస్థ మేనేజర్ నుంచి ఒప్పంద పత్రం అందుకుంటున్న చోడవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామచంద్రరావు

చోడవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీకాలేజీలో చదివే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇంటర్న్‌షిప్‌లో శిక్షణ ఇచ్చేందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఫుల్లేరేషన్ లిమిటెడ్ సంస్థ బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆసంస్థకు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు కృతజ్ఞతలు తెలిపారు. కాలేజీ ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ జీవీవీఎస్‌వీ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో ఫుల్లేరేషన్ లిమిటెడ్ సంస్థ బ్రాంచ్ మేనేజర్ పి.నాయుడు కళాశాల ప్రిన్సిపాల్‌కు ఒప్పందపు పత్రం అందజేశారు. కళాశాలకు చెందిన డిగ్రీ విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఇంటర్న్‌షిప్‌లో భాగంగా మొదటి రెండు నెలలు, చివరి సెమిస్టరులో ఆరునెలలు పాటు పరిశ్రమలు, బ్యాంకులు, భీమాసంస్థలు, సచివాలయాల్లో పని అనుభవంపై శిక్షణ ఇస్తామని కోఆర్డినేటర్ ప్రసాద్‌బాబు చెప్పారు. వైస్ ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

310 క్యూసెక్కుల పెద్దేరు నీరు విడుదల

మాడుగుల రూరల్: పెద్దేరు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టాన్ని దృష్టిలో ఉంచుకొని 310 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయంలో పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు కాగా, బుధవారం నాటికి 136.10 మీటర్లకు చేరింది. జలాశయంలోకి 185 క్యూసెక్కుల నీరు వచ్చి చేరడంతో, 310 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నట్లు జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఏపీజీవీబీలో రుణాలు ఈజీ


ఖాతాదారుల కుటుంబాలకు బీమా చెక్కును అందిస్తున్న బ్యాంకు అధికారులు

- రైతులకు సున్నా వడ్డీకే వ్యవసాయ రుణాలు
- ఏపీజీవీబీ చైర్మన్ కె.ప్రవీణ్‌కుమార్

పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) ద్వారా అన్ని రంగాలకు సులభ పద్ధతిలో రుణాలు మంజూరు చేస్తున్నట్టు బ్యాంక్ చైర్మన్ కె.ప్రవీణ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని మెయిన్ బ్రాంచ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీజీవీబీ ద్వారా వ్యవసాయ రంగంలో రైతులకు 78 శాతం రుణాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీకే రుణాలు, విద్యా రుణాలు, వ్యాపారాభివృద్ధికి ప్రత్యేక రుణాలు మంజూరు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఆంధ్రాలోని ఉత్తరాంధ్ర 5 జిల్లాలోను, తెలంగాణాలోని 21 జిల్లాల్లోను తమ బ్యాంకు శాఖలు ఉన్నాయన్నారు. రెండు రాష్ట్రాల్లోను 771 శాఖల ద్వారా ఖాతాదారులకు రుణాలతోపాటు, మెరుగైన సేవలు అందిస్తున్నట్టు వెల్లడించారు. 2006లో ప్రారంభమైన తమ బ్యాంకు టర్నోవర్ ప్రస్తుతం రూ.47 వేల కోట్లకు చేరిందన్నారు. రూ.50 వేల కోట్ల వ్యాపార లావాదేవీలకు చేరేలా యాజమాన్యం, సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. తమ బ్యాంకులో డిపాజిట్లపై మిగిలిన బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అదే విధంగా రైతులకు వ్యవసాయ రుణాలను సున్నా వడ్డీకే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. తమ ఖాతాదారులకు పీఎం జీవనజ్యోతి బీమా, సురక్ష బీమా యోజన పథకాల ద్వారా సహజ, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున బీమా అందిస్తున్నట్టు వెల్లడించారు. అదే విధంగా బ్యాంకు ఖాతాదారులకు జనరల్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా రూ.20 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అనంతరం ఇటీవల సహజ మరణం పొందిన ముగ్గురు ఖాతాదారుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున రూ.6 లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఆర్ఎం పి.ఉదయ్‌కిరణ్, బీఎం ఎన్.రాజ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, అడ్మిన్స్ టి.ఆనంద్‌బాబు, కాశీమోహన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పశువ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి గౌతమ్

డుంబ్రిగుడ: మండలంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పశుసంవర్ధక వైద్యాధికారి గౌతమ్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో ఉన్న పశువులకు తప్పనిసరిగా లంపీ వ్యాక్సిన్ వేయాలని ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో పశువులు, మేకలు, గొర్రెలకు వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయని, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, రైతులు అవగాహన కల్పించాలన్నారు. పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ, సిబ్బంది అనురాధ, సుబ్బా రావు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడల్లో ప్రోత్సాహం



క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న నేతలు

డుంబ్రిగుడ: గసభ పంచాయతీ కేంద్రంలో ఎంపీటీసీ సభ్యురాలు వంతల జెమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు జెమ్మ మాట్లాడుతూ గిరిజన యువతను క్రీడా రంగంలో పోత్సహించేందుకే చేయూతనిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో క్రీడాకారులకు వాలీబాల్‌తో పాటు ఇతర క్రీడా సామగ్రిని అందజేస్తున్నట్టు తెలిపారు. యు వత ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి మంచి క్రీడాకారులుగా గుర్తింపు పొందాలని హితవుపలికారు. ఉప సర్పంచ్ మహాదేవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సునీల్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వోఎఫ్ఆర్ లబ్ధిదారులకు రైతు భరోసా



రైతులతో మాట్లాడుతున్న ఏవో మోహన్‌రావు

ముంచంగిపుట్టు: స్థానిక ఆర్‌బీకేలో ఏవో మోహన్‌రావు రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా రైతులకు రైతు భరోసా పథకం మంజూరు అవుతుందన్నారు. వ్యవసాయ సిబ్బందిని కలిసి దరఖాస్తు చేసుకుంటే, రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల ద్వారా నగదు జమ అవుతుందని, సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తరుణ్ తదితరులున్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



అంగన్‌వాడీ సిబ్బందికి స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

మారేడుమిల్లి: స్థానిక పంచాయితీ కార్యాలయంలో పోషక ఆహార మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జెడ్పీటీసీ సభ్యుడు బాలాజీబాబు, సర్పంచ్ జాకబ్, ఉప సర్పంచ్ వీరబాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సక్రమంగా పోషకాహారాన్ని అందించాలన్నారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన స్మార్ట్‌ఫోన్‌లను అంగన్‌వాడీ టీచర్లకు పంపిణీ చేశారు. సీడీపీవో ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సచివాలయ సెక్రటరీని సన్మానిస్తున్న సర్పంచ్ చీడి శివ తదితరులు

రాజవొమ్మంగి: మూడేళ్లుగా సేవలందించి బదిలీపై కిర్లంపూడి మండలం కృష్ణవరానికి వెళ్తున్న సచివాలయ కార్యదర్శి పాలాటి నూకరాజును ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ అధికారి సత్యనారాయణ, సర్పంచ్‌లు సత్యనారాయణ, బుజ్జమ్మ, ముసలయ్య, రాంబాబు, అర్జున్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తీరుపై ధ్వజం

కొయ్యూరు: గిరిజన చట్టాలపై పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ రాజుబాబు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈశ్వరి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చట్టాలను రక్షించాల్సిన ఆమె అందుకు భిన్నంగా వ్యవహరించారని, మన్యం నుంచి లేటరైట్ తరలించేందుకు అప్పట్లో ప్రయత్నాలు చేశారన్నారు.

పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ

- వాడవాడలా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



రాజవొమ్మంగిలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీదుర్గ

జి.మాడుగుల: ప్రభుత్వ ఆదేశాల మేరకు అల్లూరి జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను వేశారు. నులుపురుగుల వల్ల కలిగే అనర్థాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లల్లో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, వాంతులు, బరువు తగ్గిపోవడం వంటి ప్రమాదకర పరిణామాలకు కడుపులో పెరిగే నులిపురుగులే కారణమన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన కూడదన్నారు. నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతలను పాటించాలన్నారు. గోళ్లు పెరగకుండా చూడాలని, చేతులు తరచూ సబ్బుతో కడుక్కోవాలని సూచించారు. గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



పెదబయలులో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

జి.మాడుగుల పీహెచ్‌సీ పరిధిలో బందవీధి బాలికల ఆశ్రమోన్నత పాఠశాల, జి.మాడుగుల గురుకులం పాఠశాల, కెజీబీవీ , మినీ గురుకులం పాఠశాలలను ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలా ప్రసాద్ సందర్శించారు. నులిపురుగు నిర్మూలన కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతతోనే నులిపురుగు నివారణ సాధ్యమన్నారు. విద్యార్థులు నులుపురుగుల మాత్రలు వేసుకొని వాటిని నివారించుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు విఘ్నేష్, రవికుమార్, సోముదొర, ఆరోగ్య విస్తరణాధికారి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: పెదవలస, రంపుల గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ కోమలి ఆధ్వర్యంలో హెల్త్ ఎగ్జిక్యూటర్ శ్రీనివాస్ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు.



ముంచంగిపుట్టులో విద్యార్థికి నులిపురుగు నివారణ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: కిలగాడ కేజీబీవీ, బంగారుమెట్ట, పెదగూడ, మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలల్లో వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు అందజేశారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెదబయలు: సీహెచ్‌ఏ పాఠశాల-1లో వైద్యాధికారి జి.రమా ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు.

డుంబ్రిగుడ: కించుమండ పంచాయతీ కొసాంగుడ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్య సిబ్బంది, హెచ్ఎం విలియం కేరీ, పాఠశాల కమిటీ చైర్మన్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదుర్గ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారు. కేంద్ర ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సర్పంచ్ బి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్‌రాజు, ఏఎన్ఎం. వెంకటలక్ష్మి ఉన్నారు. జడ్డంగిలో డాక్టర్ సుజి, లాగరాయి పీహెచ్‌సీ పరిధిలో డాక్టర్ యామినిప్రియల ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ జరిగింది. ఏఎన్ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలున్నారు.



డుంబ్రిగుడలో మాత్రలను పంపిణీ చేస్తున్న సిబ్బంది



విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

మారేడుమిల్లి: బోదులూరు పీహెచ్‌సీలో డాక్టర్ నరేష్ చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇచ్చారు.

అడ్డతీగల: ఎల్లవరం పిహెచ్‌సి పరిధిలో వైద్యాధికారి కె.భాస్కర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు ఇచ్చారు. 5592 విద్యార్థులు మాత్రలు ఇచ్చినట్టు తెలిపారు.

కూనవరం: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు విజయ పంపిణీ చేశారు. సర్పంచ్ పార్వతి, వైద్యాధికారి డాక్టర్ సునీల్, హెల్త్ సూపర్‌వైజర్ భద్రకాళి, ప్రిన్సిపాల్ విమల, ఎస్.స్వరాజ్యం, సుమలత, సుజాత, హెచ్ఏ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జి.మాడుగులలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు ఇస్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్



రంపుల గ్రామంలో చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది



కేంద్ర ప్రాథమిక పాఠశాలలో చిన్నారికి మాత్రను మింగిస్తున్న ఎంపీపీ గోము వెంకటలక్ష్మి

టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన ఎంపీ మాధవి, ఎమ్మెల్యే పాల్గుణ





టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతులు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: టీటీడీ చైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాస గృహంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, శివ ప్రసాద్ దంపతులు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అరకు పార్లమెంట్ పరిధిలోని పలు ప్రధాన సమస్యలతో పాటు టీటీడీకి గిరిజన వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల వినియోగంతో పాటు పార్టీ కార్యక్రమాలపై సుబ్బారెడ్డితో వారు చర్చించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణలు ఉన్నారు.

అదనపు భవనం కోసం వినతి



ఎంఈవో చెల్లయ్యకు వినతిపత్రం అందజేస్తున్న విద్యా కమిటీ చైర్మన్ రాంప్రసాద్ తదితరులు

ముంచంగిపుట్టు: కర్రిముఖీపుట్టు పంచాయతీ కేంద్రంలో ఎంపీపీ పాఠశాలకు అదనపు భవనం మంజూరు చేయాలని కోరుతూ ఎంఈవో చెల్లయ్యకు సర్పంచ్ పులమొత్తి, విద్యా కమిటీ చైర్మన్ ఎం.రాం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అర్జున్ తదితరులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటి నుంచి 8వ తరగతి వరకు 143 మంది విద్యార్థులున్నారని, కేవలం మూడు తరగతి గదులు ఉండడంతో నిర్వహణ కష్టంగా మారిందని, విద్యార్థులు కూర్చునేందుకు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రెండు అదనపు తరగతులు మంజూరు చేస్తే సమస్య తీరుతుందని కోరారు. దీనిపై ఎంఈవో స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్తామన్నారు. గ్రామస్తులు దసుధ, కృష్ణ వేణి, మంగ్ల తదితరులున్నారు.

బస్ షెల్టర్ పనులు ప్రారంభం



బస్సు షెల్టర్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సీతమ్మ తదితరులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో నూతన బస్ షెల్టర్ నిర్మాణానికి ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచ్‌లు, అఖిలపక్ష నేతలు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.5లక్షలతో ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్ నిర్మించనున్నట్టు చెప్పారు. ఎంపీడీవో ప్రభాకరం, సర్పంచ్‌లు సుభాష్‌చంద్ర, త్రినాథ్, జెడ్పీ చైర్‌పర్సన్ భర్త జె.వి.వి.ఎస్.మూర్తి, మండల మహిళ అధ్యక్షురాలు లలిత, అఖిల పక్ష నేతలు మల్లికార్జున్, శాస్త్రిబాబు, భీమరాజు, లైకోన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన



గ్రామస్తులతో మాట్లాడుతున్న జడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఇతర నాయకులు

హుకుంపేట: శోభకోట పంచాయతీ అర్లాడ గ్రామాన్ని బుధవారం జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సందర్శించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం శోభకోట గ్రామ సచివాలయాన్ని సందర్శించి, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి సత్తిబాబు, సర్పంచ్ చిన్నారావు, నాయకులు వెంకటరావు, సూరిబాబు, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి



చిన్నారుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీదేవి



విద్యార్థులకు ఆహారం వడ్డిస్తున్న ఎంపీపీ ఆనందరావు

రంపచోడవరం: ఇర్లపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఎంపీపీ బంధం శ్రీదేవి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేయగా, అన్నింటికి జవాబులు చెప్పడంతో అభినందించారు. విద్యా సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు వేశారు. నాడు-నేడు పనులు పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీటీసీ సభ్యుడు వంశీ తదితరులున్నారు.

వై.రామవరం: మండలంలోని చామగడ్డ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఎంపీపీ కడబాల ఆనందరావు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. మౌలిక సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను పరిశీలించి, వడ్డించి రుచి చూశారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసి, హెచ్ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు, సిబ్బందిని అభినందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ జోగిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, నాయకులు విజయ్‌కుమార్ తదితరులున్నారు.

కలెక్టర్ దృష్టికి మండల సమస్యలు



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సమస్యలు వివరిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను బుధవారం కలిసి మండలంలో పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎంపీపీ బంధం శ్రీదేవి చెప్పారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో జనరేటర్ సమస్య, అంబులెన్స్‌కు డీజిల్ సమస్య, నరసాపురం పీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యం గురించి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందించారని చెప్పారు. ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. తరుచూ ఆసుపత్రులను సందర్శించి, సమస్యలు ఉంటే ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారన్నారు.రంపచోడవరం కేంద్రంగా జిల్లా పరిషత్ సమావేశాన్ని నిర్వహించాలని కోరారు.ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, కుంజం వంశీలు ఉన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కొర్రా పద్మ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎంపీపీ పద్మ మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు చేరువయ్యేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశానికి పూర్తిస్థాయిలో అధికారులు హాజరుకాకపోవడంపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర చెప్పారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంలేదని, మెనూ అమలుచేయడం లేదని, పాఠశాలల్లో అభివృద్ధి పనులకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని సర్పంచ్‌లు రామకృష్ణ, హనుమంతరావు, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసిదొర సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వైద్య ఆరోగ్య, వ్యవసాయ శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఐసీడీఎస్, ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష జరిగింది.ఎంపీడీవో లోహిత్ జయసాగర్, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, కల్యాణి, తహసీల్దార్ అప్పలస్వామి, ఈవోపీఆర్డీ రమేష్, ఎంఈవో నాగభూషణం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, పీఆర్ ఏఈ వెంకటలక్ష్మి, ఏపీఎం సుంద్రమ్మ, సీడీపీవో సువర్ణమ్మ, ఏవో రవింద్రబాబు పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

సేవలతో సమాజానికి మేలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు

సాక్షి, పాడేరు : కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాల మేరకు తలారిసింగి ఏపీఆర్ కళాశాలలో విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎన్.జి.కిషోర్‌బాబు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సేవలతో సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని, రక్తం సేకరణ, ఆపద సమయంలో రోగులకు రక్తాన్ని అందిస్తు ప్రాణాలు కాపాడుతున్నారన్నారు. విద్యార్థులు ఆరోగ్యంపై అశ్రద్ధ చేయవద్దని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కళాశాలలో ఒక విద్యార్థికి రక్తం అవసరం కాగానే రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ గంగరాజు సకాలంలో స్పందించి ఒక యూనిట్ రక్తాన్ని అందుబాటులో తెచ్చారని ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మినుము విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ గంగాదేవి

కూనవరం: కొండ్రాజుపేటలో రైతులకు 90 శాతం రాయితీపై మినుము విత్తనాలను ఎంపీపీ రంగమ్మ బుధవారం పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మి, శ్రీను పాల్గొన్నారు.

గంగవరం: గంగవరం సచివాలయంలో రైతులకు మినుము విత్తనాలను వైస్ ఎంపీపీ గంగాదేవి పంపిణీ చేశారు. సర్పంచ్ అక్కమ్మ, వ్యవసాయ అధికారి విశ్వనాథ్, కార్యదర్శి కృష్ణస్వామి, సెరీకల్చర్ అసిస్టెంట్ రెహానా సుల్తానా పాల్గొన్నారు.

రైతులకు పసుపు శుద్ధి యంత్రాలు



రైతుకు యంత్రం అందజేస్తున్న సర్పంచ్ సుభద్ర

గూడెంకొత్తవీధి : మండల కేంద్రంలోని పి.కొత్తూరు గ్రామ రైతు బాలయ్యకు ఐటీడీఏ ఆధ్వర్యంలో వందశాతం రాయితీపై పసుపు శుద్ధి యంత్రాన్ని సర్పంచ్ కొర్ర సుభద్ర బుధవారం పంపిణీ చేశారు. రాయితీని సద్వినియోగం చేసుకోవా

హబీబ్ నియామకంపై హర్షం

చింతూరు: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా చింతూరుకు చెందిన ఎండీ హబీబ్ రెండోసారి ఎన్నికయ్యారు. పార్టీ తన సేవలను గుర్తించి పీసీసీ సభ్యుడిగా మరోసారి ఎంపిక చేయడం హర్షణీయమని హబీబ్ తెలిపారు. తనను పీసీసీ సభ్యుడిగా నియమించినందుకు ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దసరా ఉత్సవాలకు పందిరి రాట



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సాక్షి,పాడేరు : పాత ఆస్పత్రి సెంటర్‌లో దసరా ఉత్సవాలకు సంబంధించి బుధవారం పందిరి రాట కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు తరలివచ్చారు. అక్టోబర్ 2 నుంచి 6వ తేదీ వరకు విజయదశమి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. వైస్ ఎంపీపీ శివకుమార్, ఉప సర్పంచ్ రాము, ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, శ్రీను తదితరులున్నారు.

ఘనంగా గురజాడ జయంతి



కొయ్యూరులో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జి.మాడుగుల / కొయ్యూరు / చింతపల్లి / చింతూరు: ప్రముఖ కవి గురజాడ అప్పారావు జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కొయ్యూరు, చింతపల్లి, చింతూరు కళాశాలల్లో జరిగిన కార్యక్రమంలో గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక అభ్యున్నతి, సాంఘిక దురాచారాలను అరికట్టడానికి గురజాడ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. జి.మాడుగులలో జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో జయసాగర్, ఎంపీపీ పద్మ, కొయ్యూరులో వైస్ ప్రిన్సిపాల్ శ్రీమన్నారాయణ, చింతపల్లిలో ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, చింతూరులో ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులకు శంకుస్థాపన

డుంబ్రిగుడ: గుంటగన్నెల పంచాయతీ కూనపుట్టు గ్రామంలో నాడు-నేడు ద్వారా అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి సర్పంచ్ మోతీలాల్ బుధవారం శంకుస్థాపన చేశారు.కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు విశ్వనాథం, ఎంపీటీసీ సభ్యురాలు పద్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దేవమణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి, నాయకుడు కామేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రజాదర్బార్

అరకులోయ రూరల్: గ్రామాల్లో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి భీమారావు అన్నారు. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. ప్రజాదర్బార్‌తో ప్రజా సమస్యలను తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వెంకటబాబు, రామలింగం, చిన్నస్వామి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములపై హక్కులు కల్పించాలి

చింతూరు: ఆదివాసీలు దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న పోడు భూములకు హక్కులు కల్పించాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకురాలు కల్పన అన్నారు. ఈ మేరకు బుధవారం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీడీఏ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

చింతూరు: తమ డిమాండ్ల సాధనకోసం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులంతా ఏకం కావాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బీవీ శ్రీనివాసరావు అన్నారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలవరం నిర్వాసితుల పాదయాత్రను ఆయన బుధవారం చింతూరు మండలం మల్లెతోటలో ప్రారంభించారు. ఎంపీటీసీలు రాజ్‌కుమార్, లావణ్య, లక్ష్మి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో మెలగాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జున

దేవీపట్నం: శరభవరం పంచాయతీ ఉప్పర్య్య పాలెం గ్రామంలో ఎస్ఐ నాగార్జున అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సారా వల్ల కలిగే దుష్పరిణామాలు, ఆన్‌లైన్ మోసాలు, దొంగతనాలు, ఆత్మహత్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. యువత క్రమశిక్షణతో మెలగాలని సూచించారు.

కాలేజీలో అభివృద్ధి పనులకు భూమిపూజ

చింతపల్లిరూరల్: స్థానిక డిగ్రీ కళాశాలలో నాడు-నేడు పనులకు అధికారి బెన్నస్వామి బుధవారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.